Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143








ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 217 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | మంగళవారం 18 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 2


## పోలీసు వాహనాల్లోనే గంజాయి

ఇదేనా కూటమి పాలన?

వైయస్ జగన్ మోహన్ రెడ్డి ట్వీట్

పోలీసుల వాహనంలో గంజాయి, మద్యం దొరకటంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తాడేపల్లి:**

పోలీసుల వాహనంలో గంజాయి, మద్యం దొరకటంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పాలన ఏ స్థాయిలో కుప్పకూలిందో ఈ ఘటనే నిదర్శనం అంటూ ఫైరయ్యారు. చంద్రబాబూ... - మిగతా3లో




## పంద్రాగస్టు వేళ భారీ ఐఎస్ఐ నెట్‌వర్క్‌ను తుడిచిపెట్టాం

- 200 మందికి పైగా ఆపరేటివ్‌లను అరెస్ట్ చేశాం
- అమిత్ షా కీలక ప్రకటన
- దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు
- ఐఎస్ఐ మద్దతు గల షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను నాశనం చేసినట్లు ప్రకటన
- తద్వారా విధ్వంసర దాడుల ప్రణాళికలను భగ్నం చేసినట్లు వెల్లడి

# ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి

- డీఎస్సీపై చర్చించండి
- వైసీపీకి సీఎం చంద్రబాబు సవాల్
- శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై సీఎం చంద్రబాబు ప్రసంగం
- గత పాలకులు 5 ఏళ్ల పాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదు
- మేం అధికారంలోకి వస్తూనే తొలి సంతకం చేసి మెగా డీఎస్సీతో 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం.



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్ లైన్‌లోనే ఉంచామన్నారు. వైసీపీ నేతలు హిట్ అండ్ రన్ చర్యలతో దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. డీఎస్సీ నియామకాల అంశంపై శాసనసభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని మేం విశ్వసించాం. దానికి అనుగుణంగానే చర్యలు తీసుకున్నాం. ఐటీని - మిగతా3లో



## బీజేపీ నూతన జాతీయ కార్యవర్గం


- పురందేశ్వరికి ఉపాధ్యక్ష పదవి
- ప్రధాన కార్యదర్శులుగా 8 మంది
- బీజేపీ జాతీయ నూతన కార్యవర్గం ప్రకటించిన నితిన్ నబీన్
- 13 మందికి బీజేపీ ఉపాధ్యక్ష పదవులు
- 8 మందికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవులు



## త్వరలోనే ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలో భారత్ స్వయం సమృద్ధి

- అశ్విని వైష్ణవ్ కీలక వ్యాఖ్యలు
- కీలక ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్లలో స్వయం సమృద్ధి సాధిస్తున్న భారత్
- ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్ చైనాకు ఎగుమతి చేస్తున్న భారత పరిశ్రమలు
- ఎన్‌క్లోజర్లు, ఆప్టికల్ ట్రాన్స్‌సీవర్స్, ఆనోడ్ మెటీరియల్స్‌లోనూ ఆత్మనిర్భరత

# రాష్ట్రంలో మారిన యూడీఏల ముఖచిత్రం




- కొత్తగా 3 పట్టణాభివృద్ధి సంస్థలు ఏర్పాటు
- ఏపీలో జిల్లాల పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా యూడీఏల పరిధుల ప్రక్షాళన
- పరిపాలనా సౌలభ్యం కోసం నంద్యాల, మార్కాపురం, భీమవరం కేంద్రాలుగా మూడు కొత్త పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలకశాఖ

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత పట్టణాభివృద్ధి సంస్థల పరిధులపై నెలకొన్న గందరగోళానికి ప్రభుత్వం చెక్ పెట్టింది. కొత్త జిల్లాల సరిహద్దులకు అనుగుణంగా యూడీఏల పరిధులను హేతుబద్ధీకరిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఇవాళ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా యంత్రాంగంతో యూడీఏ అధికారులకు మెరుగైన సమన్వయం సాధించడం, పరిధిపై స్పష్టత తీసుకురావడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా మార్కాపురం, భీమవరం, నంద్యాల కేంద్రాలుగా మూడు నూతన పట్టణాభివృద్ధి సంస్థలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొత్తం 11 యూడీఏల పరిధుల్లో సర్కార్ మార్పులు చేసింది. తిరుపతి, విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ), పుట్టపర్తి, నెల్లూరు, ఒంగోలు, ఏలూరు, కర్నూలు, కాకినాడ, మచిలీపట్నం, కడప, బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థల పరిధులను కొత్త జిల్లాలకు అనుగుణంగా సవరించారు.

ఇక పరిపాలనా సౌలభ్యం కోసం మరో మూడు యూడీఏల పేర్లను ప్రభుత్వం మార్చింది. చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ పేరును చిత్తూరు, పలమనేరు, కుప్పం పట్టణాభివృద్ధి సంస్థ (సీపీకేయూడీఏ)గా, పలమనేరు, కుప్పం, మదనపల్లె యూడీఏను (అన్నమయ్య పట్టణాభివృద్ధి సంస్థ)గా మార్పు చేశారు. అనంతపురం, హిందూపురం యూడీఏను - మిగతా3లో



## అచ్చెన్న Vs బొత్స

- మండలిలో మాటల యుద్ధం
- మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ మండలిలో వైఎస్సార్సీపీ ఆందోళనతో
- తొలిరోజు కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం
- బొత్సపై మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలతో మండలిలో దుమారం

**అమరావతి**

మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైఎస్సార్సీపీ చేసిన ఆందోళనతో శాసనమండలి కార్యకలాపాలకు తొలిరోజు తీవ్ర అంతరాయం కలిగింది. వైఎస్సార్సీపీ నినాదాలతో హోరెత్తించడంతో గందరగోళం - మిగతా3లో



## అణు ప్రమాదంలో న్యాయమైన పరిహారం ఇవ్వకుండా ఆ చట్టం కోర్టులను నిరోధిస్తుందా?

- ఈ చట్టం కింద ఏర్పాటు చేసే నియంత్రణ మండలిలో సభ్యులను నియమించే ప్రక్రియలో ఎలాంటి ప్రయోజనాల సంఘర్షణ లేదనే విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆదేశం



## 2014 నుంచి నిర్వహించిన పరీక్షలన్నీ రద్దు

- ఝార్ఖండ్ సర్కార్ సంచలన నిర్ణయం
- 2014 నుంచి జరిగిన అన్ని పరీక్షలపై సమగ్ర విచారణకు ఆదేశం
- అన్ని పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపిక చేసిన అభ్యర్థుల లిస్టు సహా ఆ సంస్థకు సంబంధించిన ప్రతిదానినీ రద్దు
- కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టానికి చేసిన సవరణలపై చర్చించడానికి త్వరలో సమావేశమవుతాం.

# పీజీఆర్ఎస్‌లో 70 వినతులు స్వీకరణ

## సమస్యలను గడువులోగా పరిష్కరించాలి: కడ పీడీ వికాస్ మర్మత్



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు17:**
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఐఏఎస్ ప్రజల నుంచి మొత్తం 70 వినతులను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి వచ్చిన వినతుల్లో రెవెన్యూ శాఖకు అత్యధికంగా 32, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు 5, ఉపాధి, ఆరోగ్య శాఖలకు చెరో 4, పంచాయతీరాజ్, రెస్కో, విద్యాశాఖలకు చెరో 3 వినతులు అందాయి. పోలీస్, పీ4 శాఖలకు చెరో 2 వినతులు నమోదయ్యాయి. ఇతర శాఖలకు సంబంధించి ఒక్కొక్క వినతి అందింది..ఈ సందర్భంగా వికాస్ మర్మత్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో అందిన ప్రతి వినతిని ప్రజల సమస్యగా భావించి అధికారులు బాధ్యతతో పరిష్కరించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

# సేవా కార్యక్రమాలకు మరింత విస్తరణే లక్ష్యం

## శాంతిపురం సర్వింగ్ హ్యాండ్స్ లయన్స్ క్లబ్ 3వ ఇన్‌స్టాలేషన్ వేడుకలు







**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 17:**
శాంతిపురం సర్వింగ్ హ్యాండ్స్ లయన్స్ క్లబ్ 3వ ఇన్‌స్టాలేషన్ వేడుకలు విజలాపురంలోని మురుగేష్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా లయన్ డా. మురుగేష్, కార్యదర్శిగా లయన్ రాజేష్, కోశాధికారిగా లయన్ ఉమాపతి బాధ్యతలు స్వీకరించారు. తమిళనాడుకు చెందిన పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ భువనేశ్వరి ఇన్‌స్టాలేషన్ అధికారిగా వ్యవహరించి నూతన పదాధికారులతో ప్రమాణ స్వీకారం చేయించారు. చిత్తూరు జిల్లా లయన్ భాస్కర్ ఇండక్షన్ అధికారిగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా లయన్ డా. బి. ఆర్. సురేష్ బాబు హాజరై నూతన పదాధికారులు, సభ్యులకు శుభాకాంక్షలు తెలి పారు. లయన్ డా. మహేష్, లయన్ లోకేష్, లయన్ తమీన్ ఖాన్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజలాపురం జెడ్పీ హైస్కూల్‌లో ఎస్ఎస్‌సీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి నగదు బహుమతి అందజేశారు. అలాగే క్లబ్‌లో 10 మంది నూతన సభ్యులను చేర్చుకున్నారు. సమాజ సేవే లక్ష్యంగా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని నూతన పదాధికారులు తెలిపారు.

# భూషన్నకోటలకు త్వరలో సిమెంట్ రహదారి

## రూ.15 లక్షలతో రోడ్డు పనులకు శ్రీకారం



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు17:**
కంగుంది గ్రామపంచాయతీ పరిధిలోని కౌజుగానిపల్లి సమీప భూషన్నకోటలకు రహదారి సమస్యకు పరిష్కారం లభించింది. రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పీఎస్ మునిరత్నం సోమవారం భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా సరైన రహదారి లేక వర్షాకాలంలో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, గ్రామస్థుల రాకపోకలు సులభతరం కానున్నాయి. ఈ సందర్భంగా మునిరత్నం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కుప్పం ఆర్టీసీ డిపోకు కొత్త సారథి

## నూతన డిపో మేనేజర్ రవికి ఉద్యోగ సంఘం ఘన స్వాగతం



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు17:**
కుప్పం ఆర్టీసీ డిపో నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవికి డిపో ఉద్యోగుల సం ఘం నాయకులు, సభ్యులు ఘన స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛాలు అందజేసి మర్యాద పూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు యాజ మాన్యంతో సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. డిపో అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమానికి నూతన మేనేజర్ సహకరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఈ.జయపాల్, కార్యదర్శి జి.మునెప్ప, గ్యారేజ్ కార్యదర్శి రహంతుల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ జయశంకర్, సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, సంఘం ప్రతినిధులు వెంకటయ్య నాయక్, ఎన్.ఆర్.రాజా తదితరులు పాల్గొని నూతన మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# రాజకీయాల్లో మహిళల గౌరవం కాపాడాలి

## రోజా వ్యాఖ్యలను ఖండించిన కుప్పం తెలుగు మహిళలు



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు17:**
మహిళల గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తగదని కుప్పం తెలుగు మహిళలు అన్నారు. మాజీ మంత్రి రోజా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఉద్దేశించి చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం కుప్పం టీడీపీ కార్యాలయంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, వ్యక్తిగతంగా లేదా మహిళల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. రాజకీయాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ప్రతి నాయకుడు బాధ్యతాయుతమైన భాషను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో బెస్తకుల కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగల్, కుప్పం ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, కాణిపాకం దేవస్థాన కమిటీ సభ్యురాలు వసంతమ్మ, తెలుగు మహిళలు శారదమ్మ, షహనాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# కుప్పం రిజిస్ట్రేషన్ సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ అవార్డులు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు17:**
80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కుప్పం పట్టణంలో అత్యంత ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖల్లో విశేష సేవలు అందించిన సిబ్బందికి అభినందన అవార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు. కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ప్రజలకు అవినీతి రహితంగా, పారదర్శకంగా, త్వరితగతిన సేవలు అందించడంలో విశేష కృషి చేసిన రిజిస్ట్రేషన్ సిబ్బందిని అధికారులు అభినందించి అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్--1 సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ఎ. వినోద్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ ఎ. భాస్కర్‌నాయుడు, ఆఫీస్ సబార్డినేట్ శ్రీమతి ఎ.సుమతి తదితరులను సత్కరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో సిబ్బంది చూపుతున్న అంకితభావాన్ని అధికారులు అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు.

# క్రీడల్లో మెరిసిన కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు

## అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలకు పది మంది ఎంపిక



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు17:**
కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించారు. కళాశాల నుంచి వివిధ క్రీడా విభాగాల్లో మొత్తం పది మంది విద్యార్థులు ఎంపికైనట్లు వైస్ ప్రిన్సిపాల్ సాగర్ రాజ్ తెలిపారు. ఖోఖోలో కె.దర్శిని, ఎస్.పూజ, ఎం.రమ్య, వెయిట్‌లిఫ్టింగ్‌లో వి.నరేంద్రచారి, వి.ఎం.ఆదర్శ్, వాలీబాల్‌లో ఆర్.ఇంద్రశ్రీ, అథ్లెటిక్స్‌లో వి.అర్జున్, జె.ఎస్.మోహన్, కె.సుదర్శన్, పి.జె.అరుణ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు కళాశాల ప్రోత్సాహం అందిస్తోందని ప్రిన్సిపాల్ డి.సుధారాణి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

# ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలి

## పలమనేరులో ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో ధర్నా




**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు17:**
2024 ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో సోమవారం పలమనేరు క్లాక్‌టవర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్‌డీపీఐ పలమనేరు అసెంబ్లీ అధ్యక్షుడు ముబారక్, కార్యదర్శి మహబూబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముబారక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా పలు ఎన్నికల హామీలు ఇంకా అమలు కాలేదన్నారు. ఆడబిడ్డ నిధి, 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, బీసీ సబ్‌ప్లాన్, మైనారిటీల సంక్షేమానికి సంబంధించిన పలు హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్, వడ్డీలేని రుణాలు, దుల్హన్ పథకం పునరుద్ధరణ, వక్ఫ్ ఆస్తుల సంరక్షణ వంటి హామీలను కూడా నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని ఎస్‌డీపీఐ నాయకులు హెచ్చరించారు.

# శ్రీకృష్ణ భజన మందిర కుంభాభిషేక మహోత్సవంలో టీడీపీ నాయకులు

## రూ.5 వేల విరాళం అందజేసిన టీడీపీ నేత మోహన్ మురళి



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు17:**
వెదురుకుప్పం మండలం సోమేంద్రపురం గ్రామంలో జరుగుతున్న శ్రీకృష్ణ భజన మందిరం, నవగ్రహ ప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవాలకు టీడీపీ నేత, మాజీ ఎంపీటీసీ మోహన్ మురళి హాజరై శ్రీకృష్ణ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కుంభాభిషేక మహోత్సవాల నిర్వహణకు తన వంతు సహకారంగా మోహన్ మురళి రూ.5 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చెంగ్రాయిరెడ్డి, బండి మధుసూదన్ రెడ్డి, చంద్రశేఖర్ నాయుడు, చంద్రబాబు రెడ్డి, భాస్కర్ రెడ్డి, మనోహర్ నాయుడు, నాదమునిరెడ్డి, అనిల్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పల్లె ఉమా జయంతి వేడుకలు





**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,ఆగస్టు17:**
మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు, బాలాజీ విద్యాసంస్థల అధినేత పల్లె రఘునాథ్ రెడ్డి సతీమణి స్వర్గీయ పల్లె ఉమా జయంతి వేడుకలను సోమవారం హిందూపురంలో ఘనంగా నిర్వహించారు. కోడిగెనహళ్లిలోని అంధుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆపిల్ పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం సప్తగిరి కళాశాలలో కేక్ కట్ చేసి పల్లె ఉమాకు ఘన నివాళులు అర్పించారు. విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ నారాయణరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, ఏవో గంగిరెడ్డి, డీన్ ప్రకాష్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుమన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించిన విద్యార్థులు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 17:**
శ్రీకాళహస్తి ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించే అరుదైన అవకాశాన్ని శ్రీకాళహస్తి విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. 10వతరగతి విద్యార్థులకు శాసనసభ కార్యకలాపాలను ప్రత్యక్షంగా చూపించడంతో ప్రజాస్వామ్య వ్యవస్థ, శాసనసభ నిర్వహణ, ప్రజాప్రతినిధుల బాధ్యతలపై వారికి అవగాహన పెరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో ప్రజాస్వామ్యం, శాసనసభ, ప్రజాప్రతినిధులు, చట్టాల గురించి చదివామని, అయితే శాసనసభ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించడం ద్వారా వాటిని మరింత స్పష్టంగా అర్థం చేసుకోగలిగామని తెలిపారు. ప్రజా సమస్యలను సభ్యులు సభలో ప్రస్తావించడం, వివిధ అంశాల పై చర్చించడం, ప్రశ్నలు అడగడం, ప్రభుత్వం సమాధానాలు ఇవ్వడం వంటి ప్రక్రియలను ప్రత్యక్షంగా గమనించామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని తెలుసుకున్నామని, భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని నిర్ణయించుకున్నామని విద్యార్థులు తెలిపారు. ఈ పర్యటన ద్వారా క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యత, నాయకత్వ లక్షణాలు, ప్రజా సేవ పట్ల గౌరవం వంటి విలువలను నేర్చుకున్నామని చెప్పారు. అదేవిధంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే శ్రీ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని విద్యార్థులు కలుసుకున్నారు. విద్యార్థులకు రవాణా సౌకర్యాలు కల్పించిన ఎమ్మెల్యేకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి దశలోనే రాష్ట్ర పరిపాలనా వ్యవస్థను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించిన అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు విద్యార్థులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు చిరంజీవులు, నరసింహయ్య, కిషోర్ కుమార్, డా. ఎన్. సుబ్రమణ్య శర్మతో పాటు 44 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# మధుకర్ జీకి పట్టు వస్త్రంతో సత్కారం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 17:**



శ్రీకాళహస్తి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సంఘటన మంత్రి శ్రీనూకల మధుకర్ జీ పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ప్రత్యేకంగా సన్మానించారు. శ్రీకాళహస్తి శ్రీకాళ హస్తీశ్వర స్వామి వారి దేవస్థానం తీర్థప్రసాదాలతో పాటు పట్టు వస్త్రాన్ని అందజేసి మధుకర్ జీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ మధుకర్ జీ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, పార్టీకి మరింత సేవ లందిస్తూ ప్రజా సేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్ర మణ్యం రెడ్డి, మండల అధ్యక్షులు ఆర్. హరీష్ రెడ్డి, పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి, వేడం కృష్ణ య్య, తిరుమల శెట్టి నరేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బద్వేలు రూరల్ నియోజకవర్గంగా పోరుమామిళ్ల

**వచ్చే ఎన్నికల నాటికి బద్వేలు అసెంబ్లీ జనరల్ కానుందా ?**
**గత 25 సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వ్ ఉన్న బద్వేలు**
**పార్లమెంట్ కేంద్రంగా ప్రొద్దుటూరు**

**బద్వేలు** ఇప్పటివరకు ఏడు మండలాలతో కలిసి ఉన్న బద్వేలు నియోజవర్గం పునర్ విభజన తో ప్రత్యేకంగా బద్వేలు రూరల్ పేరుతో పోరుమామిళ్ల కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. బద్వేల్ నియోజకవర్గం లో బద్వేలు పోరుమామిళ్ల కలసపాడు అట్లూరు బి కోడూరు కాశినాయన గోపవరం మండలాలు ఉన్నాయి. ఇప్పుడు పోరుమామిళ్ల కేంద్రంగా బద్వేల్ ఏర్పాటు కానున్నట్లు సమాచారం. రాజకీయ విశ్లేషకులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ నియోజకవర్గాలు కడప రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇప్పుడు అసెంబ్లీ స్థానాల సంఖ్య 15 కు పెరగవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అందులో పోరుమామిళ్ల ఎర్రగుంట్ల లక్కిరెడ్డిపల్లె కడప గ్రామీణ నియోజకవర్గంతో పాటు మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. బద్వేలు రూరల్ నియోజకవర్గ పోరుమామిళ్ల కేంద్రంగా ఏర్పాటు అయ్యే పోరుమామిళ్ల మండలం బి కోడూరు కాశి నాయన కలసపాడు మండలాలతోపాటు మైదుకూరు నియోజకవర్గం లోని బ్రహ్మంగారి మఠం మండలం కూడా కలిసే అవకాశం ఉంది. ఇక బద్వేలు నియోజకవర్గం లో బద్వేలు గోపవరం అట్లూరు మండలాలు ఉండనున్నాయి. నియోజకవర్గ విభజనపై ఆశావాహులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గత 25 సంవత్సరాలుగా బద్వేల్ అసెంబ్లీ రిజర్వు స్థానంగా ఉంది విభజన జరిగితే బద్వేల్ అసెంబ్లీ జనరల్ అవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు పార్లమెంట్ కేంద్రంగా ప్రొద్దుటూరు పార్లమెంటు అసెంబ్లీ స్థానాలు పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కడప జిల్లాలోని రాజకీయ ఉత్సాహవంతుల్లో ఎక్కడలేని విధంగా పరుగులు పెట్టిస్తుంది. ప్రస్తుతం కడప జిల్లాలో పులివెందుల జమ్మలమడుగు బద్వేలు కడప ప్రొద్దుటూరు మైదుకూరు కమలాపురం ఉన్నాయి.




తాజా నిర్ణయం ప్రకారం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు పెంపు దమాషా ప్రకారం చూస్తే రెండు నుంచి మూడు అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉంది తాజా నిర్ణయం ప్రకారం ఎర్రగుంట్ల కడప గ్రామీణ పోరుమామిళ్ల కొత్త నియోజకవర్గాలు రానున్నాయి. 1.50 లక్షలు ఓట్లు ఉండేలా కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది. దీంతో కడప కడప గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అవకాశాలు ఉన్నాయి. అవసరమైతే సిద్ధవటం మండలాన్ని కడప గ్రామీణ నియోజకవర్గంలో కలిపే అవకాశం ఉంది. ప్రతిపాదిత, ఎర్రగుంట్ల నియోజకవర్గం కింద ఎర్రగుంట్ల ముదునూరు వీరుపు నాయుడు పల్లె తొండూరు కొండాపురం సింహాద్రిపురం మండలాలను చేర్చే అవకాశం ఉంది. మూడోది ఏర్పాటు చేస్తే బద్వేలు మైదుకూరు పొద్దుటూరు నుంచి అవకాశం ఉంది పోరుమామిళ్ల పొద్దుటూరు గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అయ్యే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్రంలో పెరిగే పార్లమెంట్ స్థానాలను పరిగణలోకి తీసుకుంటే కడప జిల్లా నుంచి ఒక నియోజకవర్గానికి అవకాశం ఉంది. పట్టణ ప్రాథమిక జనాభా ఓట్ల సంఖ్యను బట్టి ప్రొద్దుటూరు పార్లమెంటు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో కడప కింద కడప రాజంపేట ప్రతిపాదిత కడప గ్రామీణ కమలాపురం బద్వేలు నియోజకవర్గాలు వచ్చే వీలు ఉంది. ప్రొద్దుటూరు పార్లమెంట్ పరిధిలోకి పులివెందుల ప్రతిపాదిత ఎర్రగుంట్ల మైదుకూరు జమ్మలమడుగు పొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గాలు వచ్చే అవకాశం ఉంది. విభజన జరిగితే పెరిగే స్థానాల్లో తమ అదృష్టం ఎలా ఉందో చూసుకోవచ్చు అనిప్రధాన పార్టీలకు చెందిన వారు ఎంతో ఆశపడుతున్నారు.

## అచ్చెన్న Vs బొత్స

-మొదటిపేజీ తరువాయి

నెలకొంది. విపక్ష నేత బొత్స సత్యనారాయణపై మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు సభలో దూమారం లేపాయి. ఇద్దరి మధ్యా జరిగిన వాగ్వాదం మండలిలో వేడిని పెంచింది. వైఎస్సార్సీపీ ఆందోళన వీడకపోవడంతో మండలిని ఛైర్మన్ మంగళవారానికి వాయిదా వేశారు.

**గందరగోళం- సభ వాయిదా**

మండలి కార్యక్రమాలు ప్రారంభం కాగానే వైఎస్సార్సీపీ సభ్యులు డీఎస్సీపై ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని మండలి ఛైర్మన్ మోషేను రాజు తిరస్కరించారు. దీంతో వైఎస్సార్సీపీ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారి ఆందోళనల మధ్యే ప్రశ్నోత్తరాలు కొనసాగించారు. కేవలం 2 ప్రశ్నలే జరిగాయి. వైఎస్సార్సీపీ సభ్యుల తీరుపై మంత్రులు మనోహర్, అచ్చెన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను ఆర్డర్‌లో పెట్టాలని ఛైర్మన్‌ను కోరారు. అదే సమయంలో డీఎస్సీపై విచారణకు బొత్స డిమాండ్ చేశారు. మంత్రి అచ్చెన్న తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీపై మాట్లాడే అర్హత వైఎస్సార్సీపీకి లేదన్నారు. బొత్సపైనా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైఎస్సార్సీపీ సభ్యులు నినాదాలు ఆపకపోవడంతో సభను కొద్దిసేపు వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమయ్యాక బొత్సకు మంత్రి అచ్చెన్న క్షమాపణ చెప్పాలంటూ వైఎస్సార్సీపీ సభ్యులు నినదించారు. మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలపై బొత్స అభ్యంతరం వ్యక్తం చేశారు. పని చేయటం చేతగానివారిని ఉద్దేశించి మాట్లాడే మాటనే తాను అన్నానని అందులో అసభ్యత లేదని అచ్చెన్న బదులిచ్చారు. వైఎస్సార్సీపీ సభ్యుల ఆందోళనతో సభను ఛైర్మన్ మరోసారి వాయిదా వేశారు.

విద్యుత్ చట్ట సవరణ బిల్లు: భోజన విరామం తర్వాత శాసనమండలి మళ్లీ సమావేశమైనప్పటికీ వైఎస్సార్సీపీ సభ్యులు నినాదాలు చేస్తూనే ఉన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును సభలో పెట్టేందుకు ఛైర్మన్ అనుమతించారు. మంత్రి గొట్టిపాటి బిల్లును ప్రవేశపెట్టగా సభ ఆమోదం పొందింది. వెంటనే మండలిని వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు.

## ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి..

-మొదటిపేజీ తరువాయి

ప్రోత్సహించటం ద్వారా టెక్నాలజీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మానవ వనరుల్ని తయారు చేశాం. విద్య రంగాన్ని తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించింది. రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా నాడు ఎన్టీఆర్ సంస్కరణలు తెచ్చారు. మహిళలకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసింది మొదట ఎన్టీఆరే. నేను సీఎం అయిన తొలినాళ్లలోనే ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాల లేకపోవటంపై తక్షణ చర్యలు తీసుకున్నాం. ప్రతీ కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, ప్రతీ మండలానికి ఓ జూనియర్ కాలేజి, ఇంజనీరింగ్ కాలేజీ, జిల్లాకు మెడికల్ కాలేజిని ఏర్పాటు చేశాం. విద్యా ప్రమాణాలు పెంచితేనే అభివద్ధి సాధ్యం అవుతుంది. ఉపాధ్యాయుల నియామకాలు చేయని 2019--24 మధ్య ఉన్న పాలకులు విద్యారంగంపై దబ్బాలు కొట్టుకున్నారు. ఇప్పటి వరకూ 14 డీఎస్సీలు జరిగితే, టీడీపీ, ఎన్డీయే హయాంలో 11 డీఎస్సీల ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం. ఇంత వరకూ అవినీతి జరిగిందని ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదని ముఖ్యమంత్రి అన్నారు. గత పాలకులు 5 ఏళ్ల పాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదు. మేం అధికారంలోకి వస్తూనే తొలి సంతకం చేసి మెగా డీఎస్సీతో 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం. కేవలం 148 రోజుల్లోనే ప్రక్రియ అంతా పారదర్శకంగా పూర్తి చేసి నియామకాలు పూర్తి చేశాం. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు సహా హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియను కట్టుదిట్టంగా చేపట్టాం. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నల్ని ఎంపిక చేసి అత్యుత్తమ విధానంలో పరీక్ష నిర్వహించాం. 154 సెంటర్లలో పరీక్షలు సీబీటీ విధానంలో చేపట్టి ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశాం. పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేసి నియామకాలు చేశాం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## రాష్ట్రంలో మారిన యూడీఏల ముఖచిత్రం

-మొదటిపేజీ తరువాయి

(అనంతపురం పట్టణాభివృద్ధి సంస్థ)గా నామకరణం చేశారు.

మరోవైపు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా పట్టణాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయి. రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం, రహదారులు, వంతెనలు, ఫ్లైఓవర్ల నిర్మాణం, తాగునీరు, మురుగునీటి పారుదల, పారిశుద్ధ్యం మెరుగు తదితర విషయాలపై దృష్టి సారించనుంది. అందుకు అవసరమైన ప్రత్యేక నిధులను సర్కార్? మంజూరు చేయనుంది. అంతేకాక నగర ప్రాంతాల్లో ఉద్యానవనాలు అభివృద్ధి, పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

**అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట**

ఇప్పటివరకు భవన నిర్మాణాలను ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు నిర్మించుకోవడం, గట్టిగా ప్రశ్నిస్తే అపరాధ రుసుంతో సరిచేసేవారు. ఇకపై పెద్ద భవన నిర్మాణాలు, లేఔట్ అనుమతులను పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా అనుమతులు పొందాల్సి ఉంటుంది. తద్వారా పారదర్శకంగా, నియమ నిబంధనల ప్రకారం అనుమతులు జారీకానున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జరిగే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడనుంది. పట్టణాభివృద్ధి సంస్థల పునర్?వ్యవస్థీకరణ ప్రక్రియపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుత జిల్లా వ్యవస్థకు అనుగుణంగా, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా యూడీఏల నిర్మాణాన్ని ఆచరణాత్మకంగా మార్చామని స్పష్టంచేశారు. తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో పట్టణాభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయని నారాయణ పేర్కొన్నారు.

## పోలీసు వాహనాల్లోనే గంజాయి

-మొదటిపేజీ తరువాయి

అసలు రాష్ట్రాన్ని ఎక్కడికి తీసుకెళ్తున్నారంటూ ప్రశ్నించిన జగన్.. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థలోనే, అక్రమాలను అడ్డుకోవాల్సిన యంత్రాంగంతోనే అక్రమాలు చేయిస్తుంటే, వాటిలోనే అవినీతి చోటుచేసుకుంటే ప్రజలు ఎవరిని నమ్మాలి?. ఎవరికి ఫిర్యాదు చేయాలి?' అని ప్రశ్నించారు. ఈ మేరకు వైఎస్ జగన్ సోమవారం (ఆగస్టు 17) ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

'హే రామ్...! గంజాయి, మద్యం అక్రమ రవాణాను అరికట్టాల్సిన పోలీసుల వాహనంలోనే గంజాయి, మద్యం బాటిళ్లు కనిపిస్తే... రాష్ట్రంలో పరిస్థితులు ఎంత దారుణంగా దిగజారిపోయాయో చెప్పడానికి ఇంతకంటే సాక్ష్యం ఇంకేం కావాలి?

చంద్రబాబు.. అసలు రాష్ట్రాన్ని ఎక్కడికి తీసుకెళ్తున్నారు? ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థలోనే, అక్రమాలను అడ్డుకోవాల్సిన యంత్రాంగంతోనే అక్రమాలు చేయిస్తుంటే, వాటిలోనే అవినీతి చోటుచేసుకుంటే ప్రజలు ఎవరిని నమ్మాలి? ఎవరికి ఫిర్యాదు చేయాలి?

ప్రకాశం జిల్లా, అద్దంకి మండలం, శంఖవరప్పాడు వద్ద జరిగిన దాన్ని ఏదో ఒక్క ఘటనగా కొట్టిపారేయలేం. రెండేళ్లుగా వ్యవస్థలను ప్రజలకోసం కాకుండా రాజకీయ కక్షసాధింపులకు, ప్రత్యర్థుల గొంతు నొక్కడానికి, మీ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడానికి, మీ ఎమ్మెల్యేలతో కలిసి కలెక్షన్లు తెచ్చిపెట్టుకోవడానికి, వాడుకున్న ఫలితమే ఈ పతనం. వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాలకు, మీ కలెక్షన్లకు వాడుకుంటే చివరకు అవి ఎంతగా భ్రష్టుపడతాయో ఈ ఘటన కళ్లకు కడుతోంది.

ఈనేపథ్యంలో, ఇద్దరు ఎస్సైలు ప్రయాణిస్తున్న కారు, తాగిన మత్తులో ఉన్న డ్రైవర్ ఒక ఆటోను ఢీకొట్టడం, ఆటోలో ఉన్నవాళ్లు తీవ్రంగా గాయపడ్డం, యాక్సిడెంట్ అయిన తర్వాత ఆ కారును చుట్టుముట్టడం, ఆ కారులో ఉన్న ఇద్దరు ఎస్సైలు మత్తులో ఉన్న పరిస్థితిలో ఉండడం, ఆ కార్ డిక్కీలో గంజాయి, మద్యం, పోలీస్ యూనిఫాం దొరకడం, చివరకు అక్కడున్న ప్రజలే జర్నలిస్టులుగా మారి, జరిగిన ఘటనను వీడియో తీసి వాస్తవాలను ప్రజల ముందుంచే ప్రయత్నం చేస్తే, "వీడియోలు తీయొద్దు, కేసులు పెడతాం" అని అక్కడకు చేరుకున్న మరో సీఐ, బెదిరిస్తున్నారంటే మీ పాలనలో పరిస్థితి ఏ స్థాయికి చేరిందో అర్థమవుతోంది. నిజాన్ని బయటపెట్టడమే నేరమా? ప్రశ్నించడమే తప్పా? ఈ ఇద్దరు పోలీసు అధికారులు ప్రైవేటు పార్టీలు నిర్వహించారని, మద్యం, గంజాయి అక్కడ వాడారని, ఆ పార్టీలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారన్న సమాచారం మరింత దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఘటనా స్థలం నుంచి కారులో ఉన్న ఆ ఇద్దరు పోలీసు అధికారులను స్థానిక టీడీపీ నాయకులు తప్పించారన్న ఆరోపణలు కూడా అత్యంత తీవ్రమైనవి. నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన వ్యవస్థతో అధికార పార్టీ నాయకుల కుమ్మక్కు ఎంత లోతుకు వెళ్లిందో ఈ ఘటన బయటపెడుతోంది.

## 85% సబ్సిడీతో గొర్రెలకు, మేకలకు పశు భీమా

## :-పి.భాస్కర్ (పశువైద్యాధికారి)

**పాములపాడు** 2026 -27 సంవత్సరానికి సంబంధించి పాములపాడు మండలానికి 220 జీవాలకు భీమా లక్ష్యం నిర్దేశించడమైనదని పశువైద్యాధికారి డాక్టర్ పి. భాస్కర్ మీడియా సమావేశంలో తెలిపారు.పాములపాడు మండలంలోని, గొర్రెల, మేకల పెంపకం దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ పి.భాస్కర్ కోరారు.ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ పి.భాస్కర్ మాట్లాడుతూ వివరాలకు సమీపంలోని, రైతు సేవా కేంద్రంలోని అనీమల్ హస్బెం డ్రి అసిస్టెంట్ , స్థానిక పశువైద్యాధికారిని సమర్పించాలన్నారు.పెంపకం దారులు 6 నెలలు దాటిన గొర్రెలకు, మేకలకు భీమా చేయించాలన్నారు.1 సంవత్సరము రూ"లు 6,000/- భీమా వర్తించుట కొరకు చెల్లించవలసిన ప్రీమియం 180 రూపాయలు కాగా, ప్రభుత్వ సబ్సిడీ రూ 153 పోను లబ్దిదారుడు కేవలం 27 రూపాయలు చెల్లిస్తే సరిపోతుందనీ అన్నారు.ప్రతి గొర్రె, మేక కి తప్పని సరిగా చెవి పోగు / ట్యాగ్ వేయించాలన్నారు.ఎప్పుడైనా చెవి పోగు / ట్యాగ్ పడిపోతే వెంటనే పశువైద్య సిబ్బంది చేత కొత్త ట్యాగ్ వేయించాలనీ అన్నారు.ట్యాగ్ లేనిచో భీమా వర్తించదనీ అన్నారు.ఈ కార్యక్రమంలోసిబ్బంది తిరుమలేష్, కవిత, పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎర్రకోట రాజీవ్ రెడ్డి

**నందవరం** మండలం, గురజాల గ్రామం నమస్తే ఎమ్మిగనూరు ? ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా నందవరం మండలం గురజాల గ్రామంలో 11వ రోజు కార్యక్రమానికి ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎర్రకోట రాజీవ్ రెడ్డి శ్రీకారం చుట్టారు. గ్రామానికి చేరుకున్న రాజీవ్ రెడ్డి గ్రామ నాయకులు నరసింహారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వీరస్వామి, కురువ నరసింహులు, జాను తదితరుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించి, పూలమాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,గ్రామ ప్రజలు, రైతులు, నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీలు అమలయ్యాయా? ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని రాజీవ్ రెడ్డి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బీసీ సోదరులు తమ సమస్యలను రాజీవ్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో చాంద్ భాషా గురజాల గ్రామస్తులు రాజారెడ్డి, పెద్ద నరసింహులు, హనుమంతు యువసేన సభ్యులు ఎం వీరేష్ మహేష్ నాగేంద్ర,రాముడు, రామకేసు, సురేష్, ని.బీముడు, కురువ రాముడు, తదితరులు..

## రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో నడిపించడం

## సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు17:**



రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో ముందుకు నడిపించడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ యూనిట్ ఇంచార్జ్ ఆర్.ఎస్. మణి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు రాళ్లబూదుగూరు పంచాయతీ బూత్ నంబర్ 37 పరిధిలో ఇంటింటికీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇంచార్జ్ ఆర్.ఎస్. మణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.ఎం. కుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని టీడీపీ కరపత్రాలను పంపిణీ చేశారు. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నారని వారు తెలిపారు. పెన్షన్ల పెంపుతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పరమశివ మూర్తి, మురళి, రమేష్, చిన్నబయ్య, సురేష్‌తో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా నిర్మల్ కుమార్

**రాయచోటి :** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షులు పులి నరేంద్ర కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నూతన జిల్లా కమిటీని సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ బీజేపీ అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా నియమించారు.జిల్లా కార్యదర్శిగా తనను నియమించినందుకు రాష్ట్ర పార్టీ నాయకత్వానికి, అన్నమయ్య జిల్లా పార్టీ నాయకత్వానికి నిర్మల్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ బాధ్యత లభించేందుకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, బీజేపీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని నిర్మల్ కుమార్ తెలిపారు.అలాగే నూతనంగా ఎన్నికైన అన్నమయ్య జిల్లా బీజేపీ కమిటీ సభ్యులందరికీ రాయచోటి బీజేపీ నాయకుల తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.నూతన కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో బీజేపీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## తుంగభద్ర నది ఎండిపోవడంపై కూటమి ప్రభుత్వం తీరును ఎండగట్టిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు ఇంచార్జ్ రాజీవ్ రెడ్డి

**తుంగభద్ర జలాల కోసం రైతుల ఆవేదన**

**నందవరం** మండల పరిధిలోని గురజాల గ్రామంలో తుంగభద్ర నదిలో నీరు పూర్తిగా ఎండిపోయి, తాగు,సాగునీరు అందక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.నదిలో కనీసం ప్రవహించే నీరు కూడా కనిపించకుండా పోయిందని పాడి పశువులకు సైతం నది తీరంలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని గ్రామస్తులు, రాజీవ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో నీటి మట్టాలు పూర్తిగా పడిపోయి కనీసం ప్రవాహపు జాడ కూడా లేకపోయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని రాజీవ్ రెడ్డి విమర్శించారు.తుంగభద్ర నది తీర ప్రాంత రైతులు తమ ప్రధాన సమస్యను రాజీవ్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు. తుంగభద్ర నది నుంచి నీరు వస్తుందనే నమ్మకంతో పంటలు సాగు చేశామని, వరి నాట్లు పూర్తయిన తర్వాత నీరు అందక పొలాలు బీటలు వారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.తుంగభద్ర జలాశయంలో నీరు ఉన్నప్పటికీ దిగువ ప్రాంతమైన రాయలసీమకు,నది తీర ప్రాంతాలకు సాగునీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు.తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి తుంగభద్ర జలాలను రాయలసీమ రైతులకు అందించాలని కోరారు. సాగునీరు అందక ఆయకట్టు రైతుల పంటలు ఎండిపోతున్నాయని, రైతన్నలు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నా కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు.ఇసుక రీచ్‌ల పేరుతో దోపిడీ నదిలో చుక్క నీరు లేక ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతుంటే, మరోవైపు ఇసుక రీచ్‌ల పేరుతో నదిని మరింతగా దోచుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

## ఉద్యోగంతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటిన పంచాయతీ కార్యదర్శి స్వాతి

**శాంతిపురం, చిత్తూర్ ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 17:**



ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూనే క్రీడల్లోనూ ప్రతిభను చాటుతూ రాళ్లబూదుగూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వాతి జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రభుత్వ ఉద్యోగిగా విధులను నిర్వర్తిస్తూ క్రీడలపై ఆసక్తిని కొనసాగించి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల రాళ్లబూదుగూరు గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. స్వాతి సాధించిన ఈ ఘనత గ్రామ పంచాయతీకి గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడలతో పాటు ఉద్యోగ బాధ్యతల్లోనూ అంకితభావంతో పనిచేస్తూ స్వాతి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా రాళ్లబూదుగూరు గ్రామ పంచాయతీ తరపున స్వాతికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు, రివార్డులు సాధించడంతో పాటు ఉన్నత పదోన్నతులు పొందాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

## పట్టు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దాసరి ఓబులేసుకు అభినందనలు



**పెనుకొండ, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు17:**
పెనుకొండ డివిజన్‌లో పట్టు రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ, పట్టు పరిశ్రమ అభివృద్ధికి విశేష సేవలందించిన పట్టు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దాసరి ఓబులేసుకు పెనుకొండకు చెందిన దళిత సంఘాల నాయకులు, కూటమి నాయకులు అభినందనలు తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ అధికారిగా రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత చేతుల మీదుగా ప్రశంసా ప్రతిభా పురస్కారం అందుకున్న సందర్భంగా సోమవారం ఆయనను ఘనంగా సత్కరించారు. పెనుకొండ డివిజన్‌లోని పట్టు రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక సూచనలు అందించడంతో పాటు నాణ్యమైన సీడ్ గుడ్ల ఉత్పత్తి, పట్టుగూళ్ల ఉత్పత్తిలో పాటించాల్సిన మెలకువలు, నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించడంలో ఓబులేసు కీలకంగా పనిచేశారని నాయకులు కొనియాడారు. ఆయన సేవల ఫలితంగా పట్టు ఉత్పత్తిలో డివిజన్‌ను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎం. పెద్దన్న (ఎంఆర్పీఎస్ రాయలసీమ జిల్లాల కన్వీనర్), టి. రామాంజనేయులు (ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి), ఏనుముల రామకృష్ణ (మాజీ సర్పంచ్), ఎం.ఎన్. మూర్తి (బీజేపీ అనంతపురం జిల్లా ఇన్‌చార్జి), దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు, మాజీ డీవీఎంసీ సభ్యులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు, ఎంఆర్పీఎస్ నాయకులు తిమ్మాపురం గంగన్న, కొగిర రామాంజి తదితరులు దాసరి ఓబులేసును పట్టు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులోనూ పట్టు శాఖకు, పట్టు రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ మరిన్ని ఉత్తమ పురస్కారాలు అందుకోవాలని నాయకులు ఆకాంక్షించారు.

### మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీలో

## ఘనంగా ఓరియంటేషన్ కార్యక్రమం



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 17:**
రేణిగుంట మండలం మల్లవరం గ్రామం సమీపంలో నూతనంగా నిర్మించిన మల్లారెడ్డి (ఎంఆర్) డీమ్డ్ యూనివర్సిటీలో ఓరియంటేష న్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యూని వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ ఫౌండర్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, యూనివర్సిటీ ఛాన్సలర్ మహేందర్‌రెడ్డి, ఎంఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ భద్రారెడ్డి పాల్గొని ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనివర్సిటీలో అందుబాటులో ఉన్న వివిధ కోర్సులు, విద్యా అవకాశాలు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై అవగాహన కల్పించారు. నూతన విద్యార్థులకు నిర్వాహకులు శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



**వి.కోట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు17:**
వి.కోట మండలంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. వి.కోట-కుప్పం ప్రధాన రహదారిలోని నేర్నిపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని టెంపో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎస్.బండపల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ రహమాన్ అనే యువకుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంతో రహదారిపై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, ఘటనకు సంబంధించిన ఇతర వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. యువకుడి మృతితో ఎస్.బండపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## రేణిగుంట గంగ జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు

**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు17:**



గంగమ్మ తల్లి జాతర సందర్భంగా భక్తుల భద్రతకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు సూచనల మేరకు సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది జాతర పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ జయచంద్ర తెలిపారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. జాతర ఆలయ పరిసరాలు, భక్తుల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తులరద్దీని ఎప్పటికప్పుడుపర్యవేక్షిస్తూ క్రమబద్ధంగా రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. వాహనాల రాక పోకల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగ కుండా పోలీసులు ప్రత్యేక నియంత్రణ చర్యలు చేపట్టారు. జాతరలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురికాకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచడంతో పాటు భక్తులకు అవసరమైన సూచనలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు. జాతర ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు భక్తులు పోలీసులకు సహకరించాలని సీఐ జయచంద్ర సూచించారు. రహదారులపై వాహనాల ను ఇష్టానుసారంగా నిలపకుండా, పోలీసుల సూచనలను పాటించాలని కోరారు. జాతర సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసులు, రైటర్ చలపతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న గంగాదేవి



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు17:**
ఎస్ ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్వైజర్‌గా పని చేస్తున్న గంగాదేవి సేవను గుర్తించి ఆగస్ట్ 15న ఉత్తమ అవార్డు ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా ఎస్పీ తుషార్ దూడి చేతుల మీదుగా గంగాదేవి అందుకున్నారు. ఈ ఉత్తమ అవార్డు ఆరోగ్యశాఖ మంత్రి చేతిలో అందుకోవడం నాకు ఎంతో సంతోషంగా ఉందని సూపర్వైజర్ గంగాదేవి తెలిపారు. ఉత్తమ అవార్డు అందుకున్న సూపర్వైజర్ గంగాదేవిని ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించి సత్కరించి అభినందనలు తెలిపారు.

## రేణిగుంట విమానాశ్రయంలో క్రికెటర్ తిలక్ వర్మకు టీడీపీ నేతల ఘన స్వాగతం...




**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు17:**
భారత యువ క్రికెట్ సంచలనం, తెలుగు కెరటం తిలక్ వర్మకు తిరుపతి రేణిగుంట విమానాశ్రయంలో సోమవారం ఘనస్వాగతం లభించింది. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం ఆయన విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రేణిగుంట టీడీపీ మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తిలక్ వర్మకు పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రతిభ చాటుతూ తెలుగువారికి మంచి పేరు తీసుకొస్తున్న తిలక్ వర్మను నాయకులు అభినందించారు. విమానాశ్రయం వెలుపల తిలక్ వర్మను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపారు. ఆయనతో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం ప్రదర్శించారు. అనంతరం తిలక్ వర్మ రేణిగుంట నుంచి రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

## శ్రీకృష్ణ భజన మందిరానికి రూ.10 వేల విరాళం

**శ్రీకృష్ణ స్వామివారిని దర్శించిన నంది అవార్డు గ్రహీత చక్రధర్ సిద్ధాంతి**



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 17:**
వెదురుకుప్పం మండలం సోమేంద్రపురం గ్రామంలో నిర్వహించనున్న శ్రీకృష్ణ భజన మందిరం, నవగ్రహ ప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవాల సందర్భంగా నంది అవార్డు గ్రహీత చక్రధర్ సిద్ధాంతి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ నిర్వాహకులు చక్రధర్ సిద్ధాంతి, ఆయన కుటుంబ సభ్యులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కుంభాభిషేక మహోత్సవా ల నిర్వహణకు తన వంతు సహకారంగా చక్రధర్ సిద్ధాంతి రూ. 10 వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ అభివృద్ధి, మహా కుంభాభిషేక కార్యక్రమాల నిర్వహణకు దాతలు అంది స్తున్న సహకారం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. విరాళం అందజేసిన చక్రధర్ సిద్ధాంతికి, ఆయన కుటుంబ సభ్యులకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహా కుంభాభిషేక మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు భక్తులు, దాతలు సహకరించాలని కోరారు.

### గుర్రప్ప స్వామి ఆలయకుమాభిషేకానికి

## డాక్టర్ అనగంటి హరికృష్ణ లక్ష రూపాయల విరాళం



**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు17:**
గంగాధర్ నెల్లూరు మండలం వింజం లక్ష్మీ రెడ్డిపల్లి.. గ్రామంలో శ్రీ గుర్రప్ప స్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవానికి ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ స్పీకర్ కుతూహలమ్మ తనయుడు డాక్టర్ అనగంటి హరికృష్ణ పాల్గొన్నారు. కుంభాభిషేకంమహోత్సవం సందర్భంగా శ్రీగుర్రప్ప స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు హోమంలో డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.. శ్రీ గుర్రప్ప స్వామి ఆలయానికి మాజీ డిప్యూటీ స్పీకర్ డాక్టర్ కుతూహలమ్మ జ్ఞాపకార్థంగా డాక్టర్ అనగంటి హరికృష్ణ లక్ష రూపాయలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో వేల్కూర్ బాబు రెడ్డి, కటిక పల్లి మాజీ సర్పంచ్ మార్కొండయ్య, భీమశంకర్ రెడ్డి కుట్టి నగేష్ భాను చంద్ర.. తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కాంతులతో మెరిసిన రేణిగుంట గంగ జాతర



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు17:**
గ్రామదేవత శ్రీగంగమ్మ తల్లి జాతర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జాతరను పురస్కరించుకుని ఆలయ పరిసరాలు, ప్రధాన వీధులను రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రాత్రివేళ విద్యుత్ కాంతులతో రేణిగుంట పట్టణం కొత్త శోభను సంతరించుకుంది. జాతరకు తరలివస్తున్న భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాల అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో జాతర ప్రాంతం సందడిగా మారింది.

## ఎస్టీ కాలనీల్లో టీడీపీ డోర్ టు డోర్ ప్రచారం




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 17:**
శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం పూడి, ఇలాగనూరు గ్రామాల పరిధిలోని ఎస్టీ కాలనీల్లో టీడీపీ ఆధ్వర్యంలో డోర్ టు డోర్ ప్రచారం ఉత్సాహంగా సాగింది. మండల టీడీపీ అధ్యక్షుడు రావిళ్ల మునిరాజ నాయుడు నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, స్థానిక అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మునిరాజ నాయుడు మాట్లాడుతూ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త చురుకుగా పనిచేయాలని సూచించారు. ప్రజలతో కలిసి ముందుకు సాగుతూ వారి సమస్యల పరిష్కారానికి టీడీపీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాలి చలపతి నాయుడు, గాలి మురళి నాయుడు, వాసు నాయుడు, డి. రామానాయుడు, శంకర్ నాయుడు, జెడ్పీటీసీ మునిరత్నం, మాజీ జెడ్పీటీసీ వెంకటాచలం, రమణారెడ్డి, పి. రాజేంద్ర, క్లస్టర్ కొన్నలి రమేష్, గ్రామ ఇన్‌చార్జ్‌లు జె. శేషం నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఆర్ పురం మండలంలో

## దొంగలు బాబోయ్ దొంగలు

**రోడ్డుపక్కన ఒంటరి ఇళ్లే టార్గెట్.. ఓ ఇంట్లో చోరీ, మరోచోట పట్టుబడ్డ దొంగ**

**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు17:**





ఎస్ఆర్‌పురం మండలంలో రోడ్డుపక్కన ఉన్న ఒంటరి ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగల ముఠా చోరీలకు పాల్పడుతున్న ఘటనలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ఆదివారం రాత్రి సీకే పురం గ్రామంలో ఓ ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు నగలు, హుండీ, రూ. 20 వేల నగదును దొంగలు అపహరించినట్లు బాధితులు తెలిపారు. సీకే పురం గ్రామానికి చెందిన రామయ్య రోడ్డుపక్కన ఇల్లు నిర్మించుకుని, ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరుకు వెళ్లారు. ఇదే అదనుగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించి బంగారు నగలు, హుండీలోని నగదు, రూ. 20 వేల నగదును అపహరిం చుకెళ్లినట్లు రామయ్య భార్య చంద్రమ్మ తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా చిన్న తయ్యూరు గ్రామంలో రోడ్డుపక్కన ఉన్న మరో ఇంటి తాళాలు పగలగొడుతున్న దుండగులను స్థానికులు గుర్తించారు. స్థానికులు కేకలు వేయడంతో దొంగలు సమీపంలోని పొలాల వైపు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న గ్రామస్తులు వారిని వెంబడిం చారు. అర్ధరాత్రి పెద్ద తయ్యూరు గ్రామానికి చెందిన సురేష్ హోటల్ పక్కన ఉన్న మామిడి తోటలో దొంగలను గుర్తించారు. దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు మారణా యుధాలతో బెదిరింపులకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. అయినప్పటికీ సురేష్, ప్రభాకర్ ధైర్యంగా వ్యవహరించి ఒక దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టుబడిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రంలోని ఊతుకోట సమీపంలోని గుమ్మిడిపూడి ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనల నేపథ్యంలో రోడ్డుపక్కన ఒంటరిగా ఉన్న ఇళ్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**రోగులకు, కూలీలకు పండ్లు, బ్రెడ్, మజ్జిగ పంపిణీ**




**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,ఆగస్టు17:**
గంగాధర నెల్లూరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తిరుమల ఆధ్వర్యంలో ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్ఆర్ పురం మండలంలోని నియోజకవర్గ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారీ కేక్‌ను కట్ చేసి జర్నలిస్టులు, నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం సేవా కార్యక్రమంలో భాగంగా ఎస్ఆర్ పురం తహసీల్దార్ లోకనాథ పిళ్లై, ఎంపీడీవో వనజ, పాలసముద్రం ఎస్సై రాజశేఖర్ రెడ్డి, ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సమామ రెహమాన్, మీడియా ప్రతినిధులతో కలిసి ఆసుపత్రిలోని రోగులకు, కూలీలకు పండ్లు, బ్రెడ్, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తిరుమల మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ జర్నలిస్టులు ముందుండాలని అన్నారు. ఏపీయూడబ్ల్యూజే 70 ఏళ్ల ప్రస్థానం జర్నలిస్టుల ఐక్యతకు, హక్కుల సాధనకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జయప్రకాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్, వెంకటేష్, నియోజకవర్గ సంయుక్త కార్యదర్శి రాజా, ప్రత్యేక ఆహ్వానితులు జయచంద్ర నాయుడు, ఈసీ సభ్యుడు సతీష్ పాల్గొన్నారు.



Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143